నేడు వైఎస్‌ఆర్‌సీపీ ఆవిర్భావ వేడుకలు

కూకట్‌పల్లి: వైఎస్‌ఆర్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం 10.30 గంటలకు బాలాజీనగర్‌లోని వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద జెండా ఆవిష్కరణ, కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుందని వైఎస్‌ఆర్, జగన్ అభిమానులు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అధికార ప్రతినిధి శ్యామల, వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ఐటీ వింగ్ అధ్యక్షులు సునీల్ పోసిరెడ్డి పాల్గొననున్నారని తెలిపారు. కార్యక్రమానికి అభిమానులు హాజరు కావాల్సిందిగా కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును బాధితురాలి కుటుంబ సభ్యునికి మంగళవారం అందజేశారు. ఫతేనగర్‌కు చెందిన కల్పన అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంది. రూ.1.10 లక్షల చెక్కు మంజూరైంది. ఈ చెక్కును మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుటుంబ సభ్యులకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా ఫణీంద్రకుమార్



కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడితో ఫణీంద్రకుమార్

కూకట్‌పల్లి: ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా ఫణీంద్రకుమార్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుద్ధారం మురహరి నియమించారు. అనంతరం మంగళవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కష్టపడి పని చేసే కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. బాధ్యతగా పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, మేకల మైకేల్, కొమ్ము బాబురావు, గిరి నాయుడు, వెంకటేష్‌గౌడ్, రాకేష్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



కూకట్‌పల్లి: టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, కో చైర్ పర్సన్ ఇందుమతి శ్రీరంగం మంగళవారం కైత్లాపూర్‌లోని చీర్స్ ఫౌండేషన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్నారు. కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో జ్యోతి, రామగాళ్ల రమాదేవి, సంధ్య, పొన్నం రజిత, బోజమ్మ, భారతమ్మ, విజయలక్ష్మి, యమున, రాధ, కృష్ణరాజ్‌పుత్, ఏఎంసీ డైరెక్టర్స్ అరుణ్ గౌడ్, నరేష్, పవన్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఎంపీ ఈటల రాజేందర్

చింతల్: దేవాలయాలపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ రాజేందర్ అన్నారు. గాంధీ నగర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ఘటనపై ఆలయాన్ని మంగళవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ఆలయాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పోలీసులు దొంగలను వదిలేసి భక్తులను భయభ్రాంతులకు గురిచేయడం సిగ్గుచేటన్నారు.

అమర్‌బాబుకు డాక్టరేట్ ప్రదానం

కుత్బుల్లాపూర్: సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తు సమాజ సేవ చేస్తున్న కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన బుడల అమర్‌బాబుకు గౌరవ డాక్టరేట్ లభించింది. అమెరికాలోని గాడ్ హోలి స్పిరిట్ థియోలాజికల్ అకాడమీ ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆయనకు డాక్టరేట్ పట్టాను అందజేశారు.

దరఖాస్తుల పరిశీలన ముమ్మరం!

జిల్లాలోని 13 పురపాలికల్లో ఎల్‌ఆర్‌ఎస్‌కు 1.64 లక్షల దరఖాస్తులు

నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ఆదేశాలు

సమస్యల పరిష్కారానికి సమీపిస్తున్న నిర్దేశిత గడువు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని పురపాలికల్లో ఎస్‌ఆర్‌ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తుల పరిష్కారానికి నిర్దేశించిన గడువు సమీపిస్తుండటంతో పరిశీలన కార్యక్రమంలో వేగం పెంచేందుకు అధికారయంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో పురపాలక సంఘాల అధికారులు కసరత్తును ముమ్మరం చేస్తున్నారు. దరఖాస్తుదారుల సందేహాల నివృత్తికి కలెక్టరేట్ సహా పురపాలక సంఘాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. పురపాలక అధికారులు కూడా ప్రత్యేక బృందాలతో క్షేత్రస్థాయిలో పర్యటించి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పరిష్కరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలోనే మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా పరిధిలోని అన్ని పట్టణాల్లో ఈ ప్రక్రియ వేగవంతమైంది.



పరిష్కారమైన దరఖాస్తులు 86,374

13 పురపాలక సంఘాల పరిధిలో మొత్తం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 1,64,901 వచ్చాయి. వీటిలో ఇప్పటి వరకు 86,374 దరఖాస్తులు మాత్రమే పరిష్కారమయ్యాయి. మరో 78,527 దరఖాస్తులను ఈ నెలాఖరు వరకు పరిష్కరించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఫీజు రాయితీ గడువును పెంచాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

పురపాలక సంఘం	మొత్తం దరఖాస్తులు	పరిష్కారమైనవి
నిజాంపేట	4,219	2,124
బోడుప్పల్	17,705	7,346
పీర్జాదిగూడ	9,652	4,463
జవహర్‌నగర్	330	174
ఘట్‌కేసర్	32,126	14,950
నాగారం	18,855	12,507
దమ్మాయిగూడ	21,956	11,426
పోచారం	20,991	9,941
దుండిగల్	15,088	8,708
తూముకుంట	9,182	5,842
గుండ్లపోచంపల్లి	3,035	2,066
కొంపల్లి	2,087	1,237
మేడ్చల్	9,675	5,590

శాఖల మధ్య సమన్వయానికి..

ఎల్‌ఎర్‌ఎస్ ప్రక్రియను పురపాలిక సంఘాల్లోని పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు చేపట్టాల్సి ఉంటోంది. దరఖాస్తుల పరిశీలనలో భాగంగా మొదటిదశలో మూడు శాఖల అధికారులు స్థలాన్ని పరిశీలించి జియో ట్యాగింగ్ చేయాల్సి ఉంటోంది. రెండోదశలో టీపీవో పరిశీలించి రుసుం (ఫీజు) నిర్దేశిస్తారు. మున్సిపల్ కమిషనర్ ఆమోదంతో ఎల్‌ఆర్‌ఎస్ పరిశీలన ప్రక్రియ పూర్తవుతోంది.

క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

పురపాలక సంఘాల్లోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ప్లాట్ డాక్యుమెంట్లను పరిశీలించాలి. రెవెన్యూ అధికారులు ఆ ప్లాట్ వివాదంలో ఉందా.. కేసులు ఉన్నాయా.. ప్రభుత్వానిదా.. ప్రైవేటా.. అని నిర్ధారించాల్సి ఉంటోంది. చెరువులు, కుంటల పరిధిలో స్థలం ఉందా.. లేదా.. అనే విషయాన్ని నీటిపారుదలశాఖ అధికారులు నిర్ధారించి నివేదిక ఇవ్వాల్సి ఉంటోంది.

అధికారుల మధ్య సమన్వయ లోపం..

మూడు శాఖల అధికారుల మధ్య సమన్వయం కోసం కలెక్టర్ సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేసినప్పటికినీ, తీవ్ర జాప్యం జరుగుతోందంటున్నారు. శాఖల మధ్య నెలకొన్న సమన్వయ లోపం కారణంగా దరఖాస్తుల పరిశీలన జాప్యం జరుగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూడు శాఖల అధికారులు మాత్రం నిర్లక్ష్యం తమది కాదంటూ దాటవేస్తున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) సెలవుల్లో ఉండటంతో మరో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని పర్యవేక్షించాల్సి వస్తోంది. అదనపు బాధ్యతల వల్ల ఈ ప్రక్రియకు అంతరాయం ఏర్పడుతున్నట్లు తెలుస్తోంది.

ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఖాళీ ప్లాట్లలో చెత్తను వేయవద్దని, ఆ విధంగా కాలనీ వాసులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. సాయిదుర్గ ఫార్చ్యూన్ అపార్టుమెంట్ వాసులు, పీవీ ఎన్‌క్లేవ్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనను కలిసి ఖాళీ ప్లాట్‌లో చెత్తను తొలగించాలని కోరారు. మంగళవారం చెత్త కుప్పలను పరిశీలించారు. తక్షణమే చెత్తను తొలగింపజేశారు. అదేవిధంగా వెస్లీ టీచర్స్ కాలనీలోని వాటర్ ట్యాంకర్‌ను పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఖాళీ స్థలాల్లో చెత్తను ఎవరు వేస్తున్నారో గుర్తించి వేయకుండా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో శ్యామ్, ఆదిత్యరెడ్డి, హరీష్, రవి, రఫీక్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది చైతన్య మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



చెత్త తొలగింపు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

హనుమాన్ నగర్ బస్తీ సమస్యలు పరిష్కరించాలి



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కూకట్‌పల్లి: హనుమాన్ నగర్ బస్తీలోని స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కూకట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో బస్తీలోని స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. సీపీఎం కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం. శంకర్, కూకట్‌పల్లి శాఖ కార్యదర్శి పి. ధర్మారావు, ఏ. రంగారెడ్డి, పోలయ్య, కృష్ణారావు, చలపతిరావు, జ్యోతి మాట్లాడుతూ.. వివిధ బస్తీలలో ఉన్నటువంటి స్థానిక సమస్యలను సర్వే చేసి వాటిని ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. పారిశుద్ధ్యం, మంచినీరు, వీధిలైట్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, పెన్షన్లు, రేషన్ కార్డులు, బోరు సమస్య, డ్రైనేజీ వంటి అనేక సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. వీటిని ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యే వరకు పోరాడుతామన్నారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

ఓల్డ్ బోయిన్‌పల్లి: నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. మంగళవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని నాయీ బ్రాహ్మణుల సేవా సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈఎస్‌ఐ కార్డులు అందజేసి మాట్లాడారు. ఏ సమస్య వచ్చిన తన దృష్టికి తీసుకు రావాలని చెప్పారు. కార్యక్రమంలో సేవా సంఘం జాతీయ అధ్యక్షులు అవరా జగదీష్, రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా నర్సింహులు, సభ్యులు రమేష్, యాదగిరి, నారాయణ, సుదర్శన్, రాజు, రమేష్, మల్లేష్, సుభాష్, రాజేష్, సాయిబాబా, శివ, సంజీవ, చిరంజీవి, కిషన్, రఘునందన్, ఆనంద్, సోను, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



మియాపూర్‌లో మహంకాళి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని బీకేఎన్క్లేవ్ కాలనీలో శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. కల్యాణోత్సవంలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు శ్రీనివాస్ యాదవ్, బీకే ఎన్క్లేవ్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ,మహంకాళి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

మియాపూర్‌లో రేణుక ఎల్లమ్మ,, మహంకాళి ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌లు హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాంచందర్, నాయకులు మోహన్ ముదిరాజ్, గంగాధర్, శ్రీనివాస్ యాదవ్, మహేందర్ పాల్గొన్నారు.

పట్టపగలూ వెలుగులే..



ముత్యాలమ్మ ఆలయం వద్ద ..

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ ఎస్‌పీ నగర్‌లో పట్టపగలే వీధి లైట్లు వెలుగుతున్నాయి. వారం రోజుల నుంచి లైట్లు వెలుగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదని, పగలు కూడా వెలగటంతో అధికారులకు ఫిర్యాదు చేశామని స్థానికులు పేర్కొన్నారు. ఇదే కాలనీలో రాత్రి సమయంలో వీధి లైట్లు వెలగటం లేదని, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకోవటం లేదన్నారు. పగలు లైట్లు నిలిపే విధంగా చర్యలు తీసుకొని, రాత్రి సమయాల్లో లైట్లు వెలిగేలా చూడాలని స్థానిక ప్రజలు అధికారులను కోరుతున్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

6 బైక్‌లు స్వాధీనం



మియాపూర్: ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న యువకుడు, ఇద్దరు బాలురను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీఐ రమేష్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం .. నిజాంపేట్‌లోని బండారి లేఅవుట్‌లో నివాసముంటున్న పి.ఇమాన్స్(20), అదే కాలనీకి చెందిన ఇద్దరు బాలురను స్నేహితులుగా చేసుకుని ఎవరూ లేకుండా చూసి ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్లేవారు. ఈ నెల 7వ తేదీన మాధవనగర్‌కు చెందిన నర్సింహగౌడ్ ఇంటిముందు రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాన్ని పార్క్ చేసి ఇంట్లోకి వెళ్లి వచ్చేసరికి వాహనం కనపడ లేదు. దీంతో నర్సింహగౌడ్ మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు సీఐ క్రాంతికుమార్ పర్యవేక్షణలో డిఐ రమేష్ నాయుడు బృందం దర్యాప్తు చేపట్టారు .ఇమాన్స్, బాలురను అదుపులోకి తీసుకుని విచారించగా ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. వారి వద్ద నుండి 6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఇమాన్స్‌పై కూకట్‌పల్లి, ఆర్సీపల్లి, బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లలో వాహనాల చోరీ కేసులు నమోదై ఉన్నాయి. గతంలో దొంగతనం కేసులో ఇమాన్స్ అరెస్ట్ కాగా బాలురు జువైనల్ హోంలో ఉండి కౌన్సిలింగ్ తీసుకున్నారు. బయటకు వచ్చాక మళ్లీ దొంగతనాలకు పాల్పడడంతో ఇమాన్స్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. బాలురను జువైనల్ హోంకు తరలించినట్లు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. వివేకానందనగర్ డివిజన్ మాధవరం కాలనీకి చెందిన పివి శ్రీధర్‌కు రూ.60 వేలు, కొండాపూర్ డివిజన్, మార్తాండ్ నగర్ కాలనీకి చెందిన వెంకట శివ రెడ్డికి రూ.60 వేల చెక్కులు మంజూరయ్యాయి. ఆ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు. అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు.



చెక్కు అందజేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

నీటి ఎద్దడిపై తాళం వేసి నిరసన



వాటర్ వర్క్స్ కార్యాలయంలో ట్యాంకర్లు వెళ్లే గేటుకు తాళం వేస్తున్న కార్పొరేటర్

మూసాపేట: జనతానగర్‌లోని వాటర్ వర్క్స్ కార్యాలయంలోని వాటర్ ట్యాంకర్‌లు వెళ్లే గేటుకు మంగళవారం కార్పొరేటర్ మహేందర్ తాళం వేశారు. నీటి ట్యాంకర్ల ద్వారా అమ్మకం ఎక్కువగా చేస్తుండటంతో మూసాపేట డివిజన్‌లో ఉన్న బస్తీ వాసులకు నీటి ఇక్కట్లు ఏర్పడుతున్నాయని, మూసాపేట బస్తీ వాసుల నీటి కొరత తీరేంతవరకు నీటి అమ్మకం జరపొద్దంటూ గేటుకు తాళం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం మొదలు కాకుండానే బస్తీలలో నీటి కొరత ఏర్పడుతుందన్నారు. బస్తీ వాసుల నీటి సమస్యలు తీర్చేందుకు ఎలాంటి పరిష్కారం ఆలోచించకుండా వాటర్‌వర్క్స్ అధికారులు ఉన్న నీటిని కమ్యూనిటీలకు, కాలనీలకు అమ్ముకుంటున్నారని వాపోయారు. మూసాపేట డివిజన్ బస్తీలలో నీటి సమస్య తీరేంత వరకు ఏ ప్రాంతానికి నీటిని ట్యాంకర్‌ల ద్వారా పంపించేది లేదంటు గేటుకు తాళం వేసినట్లు ఆయన తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు తాళం వేయగా. అధికారులు కూకట్‌పల్లి పోలీసుల సమక్షంలో 2.30 గంటలకు తాళం తొలగించారు. ఎర్రస్వామి, రవిగౌడ్, మల్లేష్‌గౌడ్, జానకి, అబ్బాస్, రాజేశ్వరి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌పై కేసు నమోదు

వాటర్ వర్క్స్ మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు బీఎన్‌ఎస్‌ఎస్ 132, 127 సెక్షన్ల కింద విధులకు ఆటంకం కలిగించినందుకు, గేట్ కు తాళం వేసి అధికారులను నిర్బంధించినందుకు కార్పొరేటర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాలపై దాడులను అరికట్టాలి

కూకట్‌పల్లి: హిందూ ఆలయాలపై దాడులను అరికట్టాలని, చోరీ నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. జీడిమెట్ల పరిధి గాంధీనగర్‌లోని రామలింగేశ్వర, ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆభరణాల చోరీపై ధర్నాకు సిద్ధమైన హిందూ సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. వారిని పరామర్శించి మాట్లాడారు. శివాలయంలో స్వామి వారి ఆభరణాల చోరీ జరగటం దారుణమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలయాలపై, హిందువులపై, సనాతన ధర్మంపై దాడులు ఎక్కువయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగలను పట్టుకోవాల్సిన పోలీసులు హిందూ సంఘాల నాయకులను అరెస్టు చేయటం ఏమిటని ప్రశ్నించారు.



నాయకులను పరామర్శించిన బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాంతారావు

నాయకుల ముందస్తు అరెస్టు

కేపీహెచ్‌బీకాలనీ: ఆలయంలో చోరీ ఘటనపై ఆందోళన నేపథ్యంలో పోలీసులు పలువురిని ముందస్తు అరెస్టు చేశారు. ప్రీతం రెడ్డి, సుధారవి, వరలక్ష్మి, ఎండీ హుస్సేన్, శ్రీనివాస్ రెడ్డి, కుమార్, నాగలక్ష్మి తదితరులను కేపీహెచ్‌బీ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బీజేపీ నేతల అరెస్టు



ఆల్విన్‌కాలనీ: గాంధీనగర్‌లోని శివాలయంపై దాడి ఘటనలో నిరసన వ్యక్తం చేయడానికి వెళ్తున్న బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అర కుమార్‌యాదవ్, ఎత్తరి రమేష్, మహేందర్, పున్నారెడ్డి, సంతోష్, వెంకటేష్, అనిల్, వీరేష్, జగదీర్‌లను జగద్గిరిగుట్ట పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీజేపీ వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షులు వంశీరెడ్డి అరెస్టయిన నాయకులను పరామర్శించారు. కార్యక్రమంలో రేషన్ రాజు, తిమ్మయ్య, లక్ష్మణ్, సందీప్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మోతీనగర్: ఆలయంపై దాడికి నిరసనగా గాంధీనగర్ వద్ద ధర్నా చేయడానికి వెళ్తున్న బీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీజేపీ అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్, అల్లాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ విజయ్, ప్రధాన కార్యదర్శి అంకిత్ సింగ్, యూత్ ప్రెసిడెంట్ భాను, మాదాపూర్ గ్రామం కార్యదర్శి అవుల ఆంజనేయులును అల్లాపూర్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

రేషన్‌కార్డుల కోసం దరఖాస్తుల వెల్లువ

ఏఎస్‌ఓ కార్యాలయానికి పరుగులు

బాలానగర్: రేషన్ కార్డుల కోసం కొత్తగా దరఖాస్తులు చేసే వారి సంఖ్య పెరుగుతోంది. గతంలో దరఖాస్తులు చేసిన వారికి కార్డులు ఇవ్వాల్సి ఉండగా కొత్త రేషన్ కార్డులు జారీ ఎప్పటికప్పుడు వాయిదా పడుతోంది. అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించడంతో వారంతా మీ సేవలో దరఖాస్తు చేసి తిరిగి అక్కడి నుంచి బాలానగర్‌లోని ఏఎస్‌ఓ కార్యాలయంలో దరఖాస్తు చేస్తున్నారు.

23 వేల దరఖాస్తులు

బాలానగర్ సహాయ పౌరసరఫరాల శాఖ కార్యాలయం పరిధిలో కూకట్‌పల్లి, బాలానగర్, కుత్బుల్లాపూర్ మండలాల పరిధిలో ఉంది. నెల రోజుల ఉంచి ఏఎస్‌ఓ కార్యాలయానికి దరఖాస్తుదారుల తాకిడి ఎక్కువగా ఉంది. ఇప్పటి వరకు 23 వేల మంది కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు కార్యాలయంలో అందజేశారు. 5 వేల మందికి పైగా కుటుంబాల నుంచి విడిపోయి కొత్తగా దరఖాస్తు చేసినట్లు అధికారులు తెలిపారు.



రేషన్‌కార్డుల దరఖాస్తు కోసం కార్యాలయానికి వచ్చిన ప్రజలు

ఈ ఏడాది ఎస్కీలో 400 శిక్షణా కార్యక్రమాలు

రాయదుర్గం: ప్రపంచంలో మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలను రూపొందించినట్లు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు తెలిపారు. మంగళవారం గచ్చిబౌలిలోని 'ఎస్కీ' ఆధ్వర్యంలో 2025–26 వార్షిక శిక్షణా కార్యక్రమాల కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం 400 శిక్షణా కార్యక్రమాల ద్వారా 7వేల మంది అధికారులకు శిక్షణ ఇవ్వాలని తలపెట్టినట్లు ఆయన వివరించారు. ఇంజనీరింగ్ ప్రొఫెషనల్స్‌కు ఎప్పటికప్పుడు నైపుణ్యాలు అవసరమవుతాయని సెమినార్లు, వర్క్‌షాపులు, విద్యాపరమైన పర్యటనలు, సదస్సులు, ఈ లెర్నింగ్ తదితరాల ద్వారా నేర్చుకుంటారన్నారు. జియో స్పేషియల్ సొల్యూషన్స్, స్మార్ట్ సిటీస్, గ్రీన్ బిల్డింగ్స్ ఆవశ్యకత, కొన్ని ప్రాంతాల్లో నిర్మించే కట్టడాలపై సవాళ్ళు, 3 డీ ప్రింటింగ్ ఆవశ్యకత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, 5 జీ, గ్రీన్ హైడ్రోజన్, డ్రోన్ టెక్నాలజీ తదితర అంశాలలో సుమారు 400 శిక్షణా కార్యక్రమాలను ఏప్రిల్–2025 నుంచి మార్చి–2026 వరకు 'ఎస్కీ' ప్రాంగణంలో నిర్వహిస్తామని వివరించారు. అనంతరం ఎస్కీ అధికారులు, ఉద్యోగులతో ఎస్కీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.